PRABHATA GAMANAM
RNI NO.TELTEL/2022/83842
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
వరంగల్ | సంచిక 230 | సంపుటి 4 | శనివారం | 09-05-2026 | పేజీలు 4 | వెల 3/-

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక
జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?
విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.
ఫోన్ : 7780470374



- మైనారిటీల సంక్షేమానికి సర్కార్ పెద్దపీట
- పెరిగిన హజ్ విమాన ఛార్జీల భారం ప్రభుత్వమే భరిస్తుంది
- ఓఆర్ఆర్ లోపల తిరిగే ఆటోలన్నీ ఉచితంగా ఈవీలుగా మార్పు
- మూసీ రివర్ ఫ్రంట్ లో గంగా జమునా తెహ్ జీబ్ ను చాటేలా ప్రార్థనా మందిరాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హజ్ యాత్ర బస్సుల ప్రారంభం..

వివరాలు 2వ పేజీలో..

## ఓట్ల తొలగింపునకు
# కేంద్రం కుట్ర
### ఎస్ఐఆర్ కుట్రను కలిసికట్టుగా ఎదుర్కోవాలి

"తెలంగాణ గడ్డపై మరోసారి రాజకీయ కుట్రల నీడలు కమ్ముకుంటున్నాయని, ఓటర్ల సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేందుకు తెర వెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నాంపల్లిలో హజ్ యాత్రికుల బస్సులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 'ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)' ముసుగులో భారీ ఎత్తున ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని బాంబు పేల్చారు. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే ప్రయోగించిన ఈ వ్యూహాన్ని తెలంగాణలో సాగనివ్వబోమని, ప్రజాస్వామ్యవాదులంతా కలిసికట్టుగా ఈ అప్రజాస్వామిక చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మైనారిటీల సంక్షేమం కేవలం నినాదం కాదు.. అది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేస్తూ, అటు ఆధ్యాత్మిక యాత్రలకు భరోసా కల్పిస్తూనే, ఇటు నగర ఆటో డ్రైవర్ల జీవితాల్లో వెలుగులు నింపేలా ఉచిత ఈవీ (EV) ఆటోల పథకాన్ని ప్రకటించి రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా నిలిచారు."

—హైదరాబాద్, ప్రభాత గమనం

## కళ్లు లేకుండా జన్మించిన శిశువు

- గర్భం దాల్చిన అనంతరం ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకున్న బాధిత మహిళ
- శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్య నిపుణుల రిపోర్టు
- శిశువు కళ్లు లేకుండా జన్మించడంతో ఆవేదనకు గురైన కుటుంబం
- ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ సంచలన తీర్పు
- తప్పుడు రిపోర్టులు ఇచ్చినందుకు రూ.కోటి పరిహారం చెల్లించాలని ఆదేశం

2

## నేపాలీ పనిమనుషులపై
## ప్రత్యేక నిఘా ఉంచండి

- సీపీ సజ్జనార్ హెచ్చరిక
- అవకాశం కోసం వేచి చూసి అఘాయిత్యాలు
- పనిలో చేర్చుకునే ముందు జాగ్రత్త
- రిటైర్డ్ ఐపీఎస్ భార్య హత్య కేసును ప్రస్తావించిన పోలీస్ కమిషనర్

2




## ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

- రూ. రెండు లక్షల బంగారం స్వాధీనం
- మహిళలను టార్గెట్ చేస్తూ చైన్ స్నాచింగ్ కు పాల్పడుతున్న నిందితులు

04

## 800 ఏళ్ల నాటి శివాలయం కూల్చివేత

- ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల్లో నిర్లక్ష్యం..
- వరంగల్ జిల్లా అశోక్ నగర్ లో ఘటన
- బీజేపీ ఆధ్వర్యంలో 'ధర్మాగ్రహ దీక్ష..
- పునర్నిర్మిస్తామన్న కలెక్టర్ సత్యశారద



2

## ఆగస్టు నుంచి మూసీ పనులు ప్రారంభం

- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- తొలి దశకు రూ. 7,055 కోట్లు..
- అలైన్ మెంట్ లో మార్పులకు మంత్రుల ఆదేశం
- నిర్మాణాలపై ప్రభావం లేకుండా జాగ్రత్తలు..
- రబ్బర్ డ్యామ్ నమూనాల పరిశీలన



2

నగరవాసుల చిరకాల స్వప్నమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పట్టాలెక్కబోతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. మూసీ డీపీఆర్ (DPR) వివరాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రులకు సమర్పించారు. తొలి దశ పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి, 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఉపసంఘం లక్ష్యంగా పెట్టుకుంది.

— హైదరాబాద్, ప్రభాత గమనం

## తొమ్మిదేళ్ల కన్నకూతురిని
# ముక్కలుగా నరికిన కిరాతక తండ్రి

- రిపోర్ట్ కార్డు తారుమారు చేసిందని ఘాతుకం..
- రంపంతో నరికి, సాక్ష్యాలు దొరకకుండా ఇంటికి నిప్పు
- మహారాష్ట్రలో సభ్యసమాజం తలదించుకునే ఘటన..
- నిందితుడు అరెస్ట్

కేవలం స్కూల్ రిపోర్ట్ కార్డులో మార్కులు మార్చిందనే చిన్న కారణంతో ఓ తండ్రి రాక్షసుడిగా మారాడు. కన్న ప్రేమని మరిచి, తొమ్మిదేళ్ల కుమార్తెను ఎలక్ట్రిక్ రంపంతో ముక్కలు ముక్కలుగా నరికి చంపిన అమానవీయ ఘటన మహారాష్ట్రలోని దౌండ్ తాలూకా దేవుల్గావ్ రాజే గ్రామంలో వెలుగుచూసింది. సాక్ష్యాధారాలను ధ్వంసం చేసేందుకు మృతదేహాన్ని చీరలో చుట్టి, ఇంటికి నిప్పు పెట్టిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.



2

# ఎస్ఐఆర్‌తో ఓట్ల తొలగింపునకు కుట్ర

- కేంద్రం కుట్రను కలిసికట్టుగా ఎదుర్కోవాలి
- మైనారిటీల సంక్షేమానికి సర్కార్ పెద్దపీట
- హజ్ యాత్రికులపై పెరిగిన విమాన ఛార్జీల భారం ప్రభుత్వమే భరిస్తుంది
- ఓఆర్ఆర్ లోపల తిరిగే ఆటోలన్నీ ఉచితంగా ఈవీలుగా మార్పు
- మూసీ రివర్ ఫ్రంట్ లో గంగా జమునా తెహ్ జీబ్ ను చాటేలా ప్రార్థనా మందిరాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హజ్ యాత్ర బస్సుల ప్రారంభం..



**హైదరాబాద్, ప్రభాత గమనం:**

రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో అలాంటి పరిస్థితులు రాకుండా అందరూ కలిసికట్టుగా ఈ కుట్రను ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం నాంపల్లిలో హజ్ యాత్రికుల బస్సులను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు.

### మైనారిటీలకు భరోసా.. ఆటోడ్రైవర్లకు వరం

మైనారిటీల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సీఎం తెలిపారు. ఇరాన్-ఇరాక్ యుద్ధం కారణంగా పెరిగిన విమాన ఛార్జీల భారాన్ని యాత్రికులపై పడకుండా ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. అలాగే, నగరంలోని మైనారిటీలు ఎక్కువగా ఆటో రంగంపై ఆధారపడి ఉన్నారని గుర్తు చేస్తూ.. ఓఆర్ఆర్ లోపల తిరిగే ఆటోలను ఉచితంగా ఎలక్ట్రిక్ (EV) ఆటోలుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

### విద్య, ఉపాధిలో కీలక మార్పులు

అంతకుముందు సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మైనారిటీ విద్యార్థుల కోసం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేసి ఏఐ (AI), నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మైనారిటీల కోసం ప్రత్యేక డిగ్రీ కళాశాలల ఏర్పాటు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తరహాలోనే ప్రతిభావంతులైన మైనారిటీ విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు.

### గంగా జమునా తెహ్‌జీబ్ చాటేలా మూసీ ప్రాజెక్ట్

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా తెలంగాణ మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా గుడి, మసీదు, చర్చి, గురుద్వారాలను నిర్మించాలని అధికారులను సీఎం ఆదేశించారు. "మనకు హిందూ, ముస్లిం అనే భేదాలు లేవు.. అందరూ భాయీ భాయీ" అని పేర్కొన్నారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని, ఖబరస్తాన్‌లకు భూమి కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

- నేడు ఎమ్మెల్యేలతో అమిత్ షా భేటీ..
- బ్రిగేడ్ పరేడ్ మైదానంలో ప్రమాణ స్వీకారం

**కోల్‌కతా, ప్రభాత గమనం:**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. సుదీర్ఘ కాలం సాగిన తృణమూల్ కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టి, బెంగాల్ గడ్డపై తొలిసారిగా భారతీయ జనతా పార్టీ (భాజపా) ప్రభంజనం సృష్టించింది. రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా బీజేపీ కీలక నేత సువేందు అధికారి బాధ్యతలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలందరూ ఏకగ్రీవంగా సువేందును తమ నేతగా ఎన్నుకున్నారు.

### ముగ్గురు సభ్యుల 'పవర్' ప్యానెల్

కొత్త ప్రభుత్వంలో ప్రాంతీయ మరియు సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఇద్దరు ఉప ముఖ్యమంత్రులను నియమించాలని అధిష్ఠానం నిర్ణయించింది. మహిళా నేత అగ్నిమిత్ర పాల్‌కు డిప్యూటీ సీఎం పదవి దక్కనుంది. ఒకవేళ ఆమె బాధ్యతలు చేపడితే, బెంగాల్ చరిత్రలో తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా ఆమె రికార్డు సృష్టిస్తారు. ఉత్తర బెంగాల్‌కు ప్రాధాన్యత ఇస్తూ సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌ను రెండో డిప్యూటీ సీఎంగా ఎంపిక చేశారు.

### గురువుపై శిష్యుడి గెలుపు

ఒకప్పుడు మమతా బెనర్జీకి అత్యంత ఆప్తుడిగా ఉన్న సువేందు అధికారి, ఆరేళ్ల క్రితం అనూహ్య పరిస్థితుల్లో బీజేపీలో చేరారు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతను ఓడించిన ఆయన, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లోనూ భారీ మెజారిటీతో విజయం సాధించి తన సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ 207 స్థానాల్లో గెలవడంలో ఆయన పోషించిన వ్యూహాత్మక పాత్రను గుర్తించిన అధిష్ఠానం, ఆయనకే ముఖ్యమంత్రి పీఠాన్ని కట్టబెట్టింది.

### శనివారం మెగా ఈవెంట్

కోల్‌కతాలోని చారిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ మైదానంలో శనివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత వైభవంగా జరగనుంది. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు మరియు పలువురు విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. లెఫ్ట్ ఫ్రంట్ హయాంలో బుద్ధదేవ్ భట్టాచార్య తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు బెంగాల్ ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రుల వ్యవస్థను చూడబోతుండటం గమనార్హం.

## తొమ్మిదేళ్ల కన్నకూతురిని
# ముక్కలుగా నరికిన కిరాతక తండ్రి

- రిపోర్ట్ కార్డు తారుమారు చేసిందని ఘాతుకం..
- రంపంతో నరికి, సాక్ష్యాలు దొరకకుండా ఇంటికి నిప్పు
- మహారాష్ట్రలో సభ్యసమాజం తలదించుకునే ఘటన..
- నిందితుడు అరెస్ట్



**దౌండ్ (మహారాష్ట్ర), ప్రభాత గమనం:**

కేవలం స్కూల్ రిపోర్ట్ కార్డులో మార్కులు మార్చిందనే చిన్న కారణంతో ఓ తండ్రి రాక్షసుడిగా మారాడు. కన్న ప్రేమని మరిచి, తొమ్మిదేళ్ల కుమార్తెను ఎలక్ట్రిక్ రంపంతో ముక్కలు ముక్కలుగా నరికి చంపిన అమానవీయ ఘటన మహారాష్ట్రలోని దౌండ్ తాలూకా దేవుల్గావ్ రాజే గ్రామంలో వెలుగుచూసింది. సాక్ష్యాధారాలను ధ్వంసం చేసేందుకు మృతదేహాన్ని చీరలో చుట్టి, ఇంటికి నిప్పు పెట్టిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు శాంతారామ్ చవాన్ కూతురు అనామిక (9), మూడో తరగతి విద్యార్థిని. ఇటీవల స్కూల్ ఫలితాలు రాగా, తక్కువ మార్కులు వచ్చాయని ఇంట్లో వారు అనామికను ఆటపట్టించారు. దీంతో భయం వేసిన ఆ చిన్నారి తన రిపోర్ట్ కార్డులో మార్పులు చేసింది. ఇది గమనించిన తండ్రి ఆగ్రహంతో ఊగిపోయి ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఎలక్ట్రిక్ రంపంతో అనామిక తల, గొంతు, వీపు భాగాలను ముక్కలుగా నరికేశాడు. అనంతరం మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి నిప్పు పెట్టాడు.

పోలీసుల దర్యాప్తులో నిందితుడి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కీలక విషయాలు తెలిశాయి. శాంతారామ్ భార్య గొడవల కారణంగా పుట్టింట్లో ఉంటోంది. ప్రస్తుతం అతను చింగు భోసలే అనే మహిళతో కలిసి నివసిస్తున్నాడు. హత్య జరిగిన సమయంలో ఆమె అక్కడే ఉన్నట్లు, ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని ఆమెను నిందితుడు హెచ్చరించినట్లు సమాచారం. "కేవలం రిపోర్ట్ కార్డు కోసమే ఇంతటి దారుణానికి ఒడిగట్టాడా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ జరుపుతున్నాం" అని దౌండ్ ఇన్స్పెక్టర్ గోపాల్ పవార్ తెలిపారు. నిందితుడు శాంతారామ్ చవాన్ తో పాటు చింగు భోసలేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు వీరికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

## ఉపాధి హామీ పథకం నిర్వహణ
# మరింత పారదర్శకంగా ఉండాలి

- హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- నరేగా సిబ్బందికి కంప్యూటర్లను అందజేత

**హన్మకొండ, 8 మే (ప్రభాత గమనం):**

జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిర్వహణను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా చేపట్టేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా జిల్లాకు కేటాయించిన కంప్యూటర్లను శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, నరేగా సిబ్బందికి అందజేశారు. ప్రతి మండల కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించిన డేటా నిర్వహణ, పనుల పర్యవేక్షణ, ఆన్‌లైన్ సేవలను వేగవంతంగా నిర్వహించేందుకు ఈ కంప్యూటర్లు ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగిస్తూ ఉపాధి హామీ పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆగస్టు నుంచి మూసీ పనులు ప్రారంభం

- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- తొలి దశకు రూ. 7,055 కోట్లు..
- అలైన్ మెంట్ లో మార్పులకు మంత్రుల ఆదేశం
- నిర్మాణాలపై ప్రభావం లేకుండా జాగ్రత్తలు..
- రబ్బర్ డ్యామ్ నమూనాల పరిశీలన

**హైదరాబాద్, ప్రభాత గమనం:**

నగరవాసుల చిరకాల స్వప్నమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పట్టాలెక్కబోతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. మూసీ డీపీఆర్ (DPR) వివరాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రులకు సమర్పించారు. తొలి దశ పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి, 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఉపసంఘం లక్ష్యంగా పెట్టుకుంది.

### ఎవరికీ ఇబ్బంది లేకుండా: శ్రీధర్ బాబు

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అలైన్‌మెంట్ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, నిర్మాణాలపై ప్రభావం కనిష్టంగా ఉండేలా చూడాలని సూచించారు. కాగా, మూసీ సుందరీకరణలో భాగంగా నిర్మించనున్న రబ్బర్ డ్యామ్ నమూనాలను మంత్రుల బృందం ఈ సందర్భంగా క్షుణ్ణంగా పరిశీలించింది.

### 2027 నాటికి పూర్తి చేయాలి: భట్టి విక్రమార్క



సమీక్ష అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఆగస్టులో పనులు మొదలుపెట్టి నిర్ణీత గడువు లోగా పూర్తి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. వర్షాకాలం దృష్ట్యా పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# కళ్లు లేకుండా జన్మించిన శిశువు

- డాక్టర్లు రూ.కోటి పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం
- గర్భం దాల్చిన అనంతరం ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకున్న బాధిత మహిళ
- శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్య నిపుణుల రిపోర్టు
- శిశువు కళ్లు లేకుండా జన్మించడంతో ఆవేదనకు గురైన కుటుంబం
- ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ సంచలన తీర్పు
- తప్పుడు రిపోర్టులు ఇచ్చినందుకు పరిహారం చెల్లించాలని ఆదేశం

**ఆదిలాబాద్, మే 8(ప్రభాత గమనం) :**



గర్భంలోని శిశువు ఆరోగ్యంగా ఉందని తప్పుడు వైద్య నివేదికలు ఇచ్చిన కేసులో బాధితురాలికి రూ.కోటి పరిహారం చెల్లించాలని ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. కోర్టు ఖర్చుల కింద అదనంగా రూ.34 వేలు చెల్లించాలని కూడా తీర్పులో పేర్కొంది. ఆదిలాబాద్ టౌన్‌లోని ఫిల్టర్‌బెడ్ ప్రాంతానికి చెందిన భాగ్యశ్రీ అనే మహిళ గర్భం దాల్చిన అనంతరం స్థానిక ఆసుపత్రిలో పలు పరీక్షలు చేయించుకుంది. గర్భంలోని శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు టీఫా స్కానింగ్‌తో పాటు ఇతర నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అన్ని పరీక్షల్లో శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్య నిపుణులు నివేదికలు ఇచ్చారు. అయితే 2024 జూన్ 30న ఆసుపత్రిలో శస్త్రచికిత్స ద్వారా ప్రసవం నిర్వహించగా, పుట్టిన శిశువు రెండు కళ్లు లేకుండా జన్మించింది. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అనంతరం హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ శిశువుకు చూపు రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో బాధితురాలు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. బాధితురాలి తరపు న్యాయవాది వాదనలు వినిపించగా, కేసును పూర్తిగా విచారించిన కమిషన్ అధ్యక్షుడు వైద్యుల నిర్లక్ష్యం తీవ్రంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఫిర్యాదు చేసిన తేదీ నుంచి 12 శాతం వడ్డీతో కలిసి రూ.కోటి పరిహారం చెల్లించాలని సంబంధిత వైద్య నిపుణులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా, గతంలో కూడా విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో జరిగిన ప్రమాదాల కేసుల్లో ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ బాధితులకు అనుకూలంగా పలు తీర్పులు ఇచ్చిన విషయం తెలిసిందే.

# యువత నిబద్ధతతో పనిచేయాలి

- మంత్రి కొండా సురేఖ

**హనుమకొండ, మే 8 (ప్రభాత గమనం):**



యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. యువత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. టాలెంట్ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళోజీ కళాక్షేత్రంలో మెగా జాబ్‌మేళా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ సత్యశారదదేవి పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. సమాజంలో ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. మనం తప్పు చేయనంతవరకూ ఎవరికీ భయపడొద్దని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# 800 ఏళ్ల నాటి శివాలయం కూల్చివేత

- ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల్లో నిర్లక్ష్యం..
- వరంగల్ జిల్లా అశోక్ నగర్ లో ఘటన
- బీజేపీ ఆధ్వర్యంలో 'ధర్మాగ్రహ దీక్ష'..
- పునర్నిర్మిస్తామన్న కలెక్టర్ సత్యశారద

**నర్సంపేట, ప్రభాత గమనం:**



వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్‌నగర్‌లో కాకతీయుల కాలం నాటి చారిత్రక సంపద ధ్వంసమైంది. 800 ఏళ్ల క్రితం నాటి శివాలయాన్ని ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల్లో భాగంగా జేసీబీలతో కూల్చివేయడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. క్రీ.శ. 1231 నాటి గణపతి దేవుడి కాలపు శాసనాలు ఉన్న ఈ ప్రాంతంలో, చారిత్రక కట్టడాల ఉనికిని పట్టించుకోకుండా అధికారులు వ్యవహరించిన తీరుపై నెటిజన్లు, చరిత్రకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### విచారణకు ఆదేశం - ఆగని విమర్శలు

ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేయగా, రెవెన్యూ, పురావస్తు శాఖలు సంయుక్తంగా విచారణ చేపట్టాయి. అక్కడ చారిత్రక శాసనాలు ఉన్నాయని తెలిసినా, జాగ్రత్తలు తీసుకోకుండా మట్టి కోట స్థలాన్ని చదును చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.

### ధర్మాగ్రహ దీక్షతో దద్దరిల్లిన నర్సంపేట

ఆలయ కూల్చివేతను నిరసిస్తూ నర్సంపేట బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున ధర్మాగ్రహ దీక్షకు దిగాయి. వేద పండితులతో కూల్చివేసిన స్థలంలో శుద్ధి పూజలు నిర్వహించారు. స్కూల్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, కానీ కాకతీయ కళా సంపదను నాశనం చేయడం సహించబోమని నేతలు హెచ్చరించారు. ఆలయ నిర్మాణంపై అధికారిక ఉత్తర్వులు వచ్చే వరకు పనులను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

## నేపాలీ పనిమనుషులపై
# ప్రత్యేక నిఘా ఉంచండి

- సీపీ సజ్జనార్ హెచ్చరిక
- అవకాశం కోసం వేచి చూసి అఘాయిత్యాలు
- పనిలో చేర్చుకునే ముందు జాగ్రత్త
- రిటైర్డ్ ఐపీఎస్ భార్య హత్య కేసును ప్రస్తావించిన పోలీస్ కమిషనర్

**హైదరాబాద్, ప్రభాత గమనం:**



ఇళ్లలో పనిచేసే నేపాలీ పనిమనుషుల పట్ల యజమానులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సూచించారు. ఇటీవల జరుగుతున్న నేరాలను విశ్లేషిస్తే, పనిమనుషులుగా చేరుతున్న కొందరు అవకాశం దొరికినప్పుడు యజమానులపై దాడులు చేయడం, దొంగతనాలకు పాల్పడటం వంటి ఘటనలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### అప్రమత్తతే రక్షణ:

చాలా కుటుంబాలు నమ్మకంతో పనిమనుషులను ఇంట్లోకి చేర్చుకుంటున్నారని, అయితే వారి నేపథ్యం తెలియకుండా నమ్మడం ప్రమాదకరమని సీపీ పేర్కొన్నారు. పని మనుషులు ఎప్పుడూ అవకాశం కోసం ఎదురు చూస్తుంటారని, ముఖ్యంగా ఒంటరిగా ఉండే వృద్ధులు, మహిళలు వారి సాఫ్ట్ టార్గెట్‌గా మారుతున్నారని చెప్పారు. పనిలో చేర్చుకునే ముందే వారి ఆధార్ కార్డు, నేపాల్‌లోని వారి స్వస్థలం మరియు ఫోన్ నంబర్ల వంటి పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ఉద్యోగంలో స్థాయి పెరిగిన కొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల ఏఎస్సై స్థాయి నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్‌లుగా పదోన్నతి పొందిన 25 మంది అధికారులు పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఎస్.ఐ భుజాలపై నక్షత్ర చిన్నహాలను అలంకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా ప్రజల పట్ల మరింత బాధ్యతతో పనిచేసే అవకాశం అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో వినడం, చట్టపరంగా వేగవంతమైన చర్యలు తీసుకోవడం, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ, బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి అధికారి కీలక పాత్ర పోషించాలని, విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. నూతనంగా పదోన్నతి పొందిన అధికారులు తమపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీపీ తెలిపారు.

## నిబద్ధతతో పనిచేయాలి

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
- అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



ప్రజలకు నిబద్ధతతో సేవలందిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. శాయంపేట నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సుధాకర్ రెడ్డి శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం, మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన సుధాకర్ రెడ్డికి సీపీ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు పని చేయాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దిగువ స్థా యి అధికారులు, సిబ్బంది పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాల ని తెలిపారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహ ణ, ప్రజల భద్రత అంశాల్లో అప్రమత్తంగా వ్యవహ రించాలని ఆదేశించారు. శాఖ ప్రతిష్ట పెరిగేలా ప్రతి పోలీస్ అధికారి క్రమశిక్షణతో, పారదర్శకం గా పనిచేయాలని సీపీ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నా రు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సేవా భావంతో విధులు నిర్వహిస్తే పోలీస్ శాఖపై ప్రజ ల విశ్వాసం మరింత పెరుగుతుందని అన్నారు. నూతన సీఐ సుధాకర్ రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

# పాఠశాల విద్యలోకి ఇంటర్

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రద్దు కానున్న ఇంటర్ బోర్డు, నేడో రేపో ఆర్డినెన్స్ జారీ
- తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డుగా నామకరణం..?
- ఇంటర్ ప్రవేశాలకు తాత్కాలిక బ్రేక్



**హైదరాబాద్ (ప్రభాత గమనం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది.పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తు మొదలు పెట్టింది.జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా స్కూల్ విద్యను 12వ తరగతి వరకు ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 100 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి 2026-27 విద్యాసంవత్సరం నుంచే 11 తరగతి బోధన ప్రారంభిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ కొత్త విద్యావిధానం అమలులోకి వస్తే పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇకపై జూనియర్ కాలేజీలకు వెళ్లకుండా అదే పాఠశాలలో 11 వ తరగతి(ప్లస్ టూ ఎడ్యుకేషన్ సిస్టమ్)చదవనున్నారు. ఈ విధానం సక్సెస్ అయితే తెలంగాణలో పాఠశాల, ఇంటర్ విద్యకు ఒకే బోర్డు ఏండనుంది.ఇంకా చెప్పాలంటే ఇంటర్ బోర్డు విలీనం కానుంది అని తెలుస్తోంది. ఇకపోతే రాష్ట్రంలో ప్లస్ టూ విద్యావిధానం అమలుకు సంబంధించి అవసరమైన మార్గదర్శకాలను సిద్ధం చేయాలని విద్యాశాఖ మంత్రి, సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

**- తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డుగా నామకరణం..?**

తెలంగాణలో ఇంటర్ విద్య పాఠశాల విద్యలోకి విలీనం కానుంది. ఇంటర్‌ను పాఠశాల విద్యలోకి విలీనం చేస్తే ఇంటర్ బోర్డు రద్దు అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపై పాఠశాల, ఇంటర్ విద్యకు ఒకటే పరీక్షల బోర్డు ఉండే అవకాశం ఉది. నూతన విద్యాసంవత్సరం (2026-27) మరికొన్ని రోజుల్లో ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ విలీనంపై తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. అటు ఎస్ఎస్‌సీ బోర్డు ఇటు ఇంటర్ బోర్డు రెండింటికి వేర్వేరు చట్టాలున్న కారణంగా వాటిని సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడో రేపో ఆర్డినెన్స్ జారీ చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యాశాఖ ఇన్‌ఛార్జి సెక్రటరీ శ్రీదేవసేన సమక్షంలో పాఠశాల, ఇంటర్ విద్యాశాఖ అధికారులు గురువారం సమావేశమై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉమ్మడి బోర్డుకు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (టీజీఎస్ఈబీ)గా నామకరణం చేస్తామని డిసెంబరులో విడుదల చేసినటువంటి రైజింగ్ తెలంగాణ దార్శనిక డాక్యుమెంట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసిన అంశంపై మరోసారి చర్చించారు.

**కామన్ బోర్డు ఏర్పాటు చేసే ఛాన్స్...**

పాఠశాల విద్యలోకి ఇంటర్ విద్యను విలీనం చేయాలంటే ఆ రెండు చట్టాలను కలిపి ఒక కొత్త చట్టాన్ని రూపొందించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా పాఠశాల విద్యకు సంబంధించి తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్టు (1982) సవరించాల్సి ఉంది. అలాగే ఇటర్ విద్యకు సంబంధించి తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా చట్టాన్ని (1971) రద్దు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం విలీన ప్రక్రియపై కసరత్తు జరుగుతున్న తరుణంలో ప్రభుత్వ పరీక్షల విభాగం (ఎస్ఎస్‌సీ బోర్డు), ఇంటర్మీడియట్ విద్యామండలి (ఇంటర్ బోర్డు)ని కలిపి ఒకే ఉమ్మడి బోర్డును ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అటు కేంద్ర విద్యాశాఖ సైతం రాష్ట్రాల్లో పది, ఇంటర్‌కు ఒకే బోర్డు ఉండాలని సూచించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కూడా పాఠశాల విద్యలోకి ఇంటర్ విద్యను విలీనం చేసే ప్రక్రియలో దూకుడు పెంచింది.

**-విలీనంతో ప్రయోజనాలు ఇవే...**

ఇదిలా ఉంటే ప్రతీ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులు పదోతరగతి ఉత్తీర్ణులు అవుతున్నారు. వీరిలో దాదాపు చాలా మంది విద్యకు దూరం అవుతున్నారు. ఇంటర్, తత్సమాన విద్యలో చేరకుండా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం సొంత గ్రామాల్లో ఏదోఒక పనిచేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు పైచదువులకు దూరం అవుతున్నారు.ఈ క్రమంలో ఆ డ్రాపౌట్స్ తగ్గించాలంటే పాఠశాల విద్య పరిధిలోకి ఇంటర్ తీసుకురావడం మంచిదనే అభిప్రాయం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.అంతేకాదు పాఠశాల విద్యలోకి ఇంటర్‌ను విలీనం చేస్తే సమగ్ర శిక్షా, పీఎం శ్రీ తదితర పథకాల కింద మరిన్ని నిధులు పొందే అవకాశం ఉంటుందని అలాగే మౌలిక సదుపాయాలను పెంచుకోవచ్చు అని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ప్రతీ స్కూల్‌లో పూర్తిస్థాయి ల్యాబ్‌లు ఉండాలని స్పష్టం చేస్తోంది. అయితే జూనియర్ కాలేజీల్లో సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయి కానీ పాఠశాలలకు లేవు. ఇప్పుడు ఈ రెండింటిని కలపడం వల్ల వేర్వేరు ల్యాబ్‌లు ఉండాల్సిన అవసరం లేదు. లైబ్రరీలను, ఇతర సౌకర్యాలను సమర్థంగా వాడుకునే అవకాశం ఉంది. పాఠశాల, ఇంటర్‌కు ఒకే టీచర్లు ఉండటం కారణంగా వారి బోధనకు విద్యార్థులు అలవాటుపడే అవకాశం ఉంది. అంతేకాదు ఏ విద్యార్థి విద్యా సామర్థ్యం ఏమిటో టీచర్లకు మరింత ఈజీగా అర్థమయ్యే అవకాశం ఉంది.

**- ఇంటర్ ప్రవేశాలకు బ్రేక్..**

పాఠశాల విద్యలోక ఇంటర్ విద్యను విలీనం చేసే ప్రక్రియకను కసరత్తు చేసిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గవర్నమెంట్, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో జరగాల్సిన అడ్మిషన్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. వాస్తవానికి మే 8వ తేదీ నుంచి వచ్చే విద్యా సంవత్సరానికి (2026-27) సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సర అడ్మిషన్లు మొదలు కావాల్సి ఉంది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ షెడ్యూల్ జారీ చేశారు. విద్యార్థుల అడ్మిషన్ల కోసం ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని... జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, తొలి విడత అడ్మిషన్లు జూన్ 30వ తేదీకి ముగుస్తాయని పేర్కొన్నారు.అయితే విలీన ప్రక్రియ శరవేగంగా జరుగుతుండటంతో ఆ ఆదేశాలను నిలిపివేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు ప్రవేశాలు చేపట్టవద్దని పేర్కొన్నారు. ఇంటర్ విద్యలో కొన్ని సంస్కరణలు అమలు చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## జనగణన ర్యాలీలో అధికారుల నిర్లక్ష్యం

- చెత్త బండిలో పిల్లల తరలింపు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

**హైదరాబాద్ మే8(ప్రభాత గమనం):**

జనగామ పట్టణ కేంద్రంలోని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం నుండి నెహ్రూ పార్క్ వరకు జనగణన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న పిల్లలను మున్సిపాలిటీ చెత్త బండిలో తరలించిన మున్సిపల్ అధికారులు. పిల్లల పట్ల అధికారులు వ్యవహరించిన తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు

- ఇద్దరికి జైలు శిక్ష..
- ఎనిమిది మంది మైనర్లను బాలల పరిశీలన గృహానికి పంపిన ట్రాఫిక్ పోలీసులు



**ప్రభాత గమనం , వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కాజీపేట ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. అదనపు డీసీపీ (ట్రాఫిక్ అండ్ లా అండ్ ఆర్డర్) రాయల ప్రభాకర్ రావు సూచనలు, ఏసీపీ ట్రాఫిక్ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మొత్తం తొమ్మిది మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిలో ఇద్దరు అధిక మోతాదులో మద్యం సేవించినట్లు గుర్తించిన పోలీసులు వారిని గౌరవ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో బైరి సంతోష్, రవిరాకుల విజయ్ కుమార్‌లకు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజశేఖర్ రెడ్డి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అనంతరం వారిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. అదేవిధంగా మైనర్లు వాహనాలు నడుపుతున్న ఘటనలపై కూడా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తున్న ఎనిమిది మంది బాలురను గుర్తించి వారిపై చార్జిషీట్లు నమోదు చేశారు. అనంతరం వారిని గౌరవ జువెనైల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, ఒక రోజు పాటు బాలల పరిశీలన గృహానికి పంపించారు. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ సీఐ పి. వెంకన్న మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై భవిష్యత్తులో మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే మైనర్లు, అలాగే వారికి వాహనాలు అప్పగించే పెద్దలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.



## ఉప్పరపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటు..

- నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం
- ఎస్సై క్రాంతి కిరణ్

**కేసముద్రం, మే 8(ప్రభాత గమనం):**

కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా గ్రామ సర్పంచ్ ఏర్పుల సునీత కుమరస్వామి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంలో ఎస్సై క్రాంతి కిరణ్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చడం అభినందనీయమని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడంతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కూడా ఉపయోగపడతాయన్నారు. గ్రామాభివృద్ధికి సర్పంచ్ తీసుకున్న ఈ చర్య సంతోషకరమన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. 24 గంటల నిఘాతో గ్రామంలో భద్రత పెరుగుతుందని, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కుండే బాలకుమార్ మంద ప్రవీణ్, సంకు శ్రీనివాస్ రెడ్డి, ఎసల్ల సత్యనారాయణ, సుధగాని విజేందర్, మంచాల కుమారస్వామి, కారోబార్ కంచ కట్టయ్య, ఏర్పుల కృష్ణ మహేందర్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో 33 వేల కోట్ల ప్రజా ధనం వృథా

- రెండున్నరేళ్లయినా కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి ఎత్తలేదు
- పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**రంగారెడ్డి మే8(ప్రభాత గమనం):**



రంగారెడ్డి జిల్లా చౌదరి గూడ మండలం లక్ష్మి దేవిపల్లి గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాలమూరు, రంగారెడ్డి సాధన సభ ను ఏర్పాటు చేశారు. సభలో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. పార్టీ ఏర్పాటు చేసాక మొదటి సభ ఇక్కడ ఏర్పాటు చేసుకోవడం సంతోషం. తెలంగాణ ఉద్యమమే నీళ్ల కోసం మొదలైంది. తెలంగాణ వచ్చి పన్నెండేళ్లయినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు రాలేదన్నారు. 33 వేల కోట్ల రూపాయలు ప్రజా ధనం ఖర్చు చేశారన్నారు. పదేళ్లు పరిపాలించే అవకాశం వస్తే ఒక్క చుక్క కృష్ణ నీరు రాలేదు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్నప్పుడే ఇచ్చిన జీవో ప్రకారం జూరల నుండి నీరు తెచ్చి ఉంటే ఈ పాటికి పాలమూరు సస్యశ్యామలం అయ్యేది. అలా కాకుండా పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ ను డిజైన్ మార్చి కృష్ణ నది నుండి తెస్తామని సమయం తో పాటు ప్రజాధనం వృధా చేశారు. బిఆర్ఎస్ పార్టీ ని ప్రజలు క్షమించరన్నారన్నారు. బి ఆర్ ఎస్ హయం లో మొదటి అయిదేళ్లు ఇరిగేషన్ మంత్రి గా పని చేసిన గుంట నక్క వల్లనే ప్రాజెక్ట్ ఆగమయ్యిందన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం రాగానే ప్రాజెక్ట్ కట్టి తీరుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర యేల్లయితున్నా ఒక్క తట్టేడు మట్టి కూడా ఎత్తలేదున్నారు. కానీ 6 వేల కోట్ల డబ్బులు కేటాయించి 12 మంది ఎమ్మెల్యే లు పంచున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు పాతాలానికి పంపుతారన్నారు. దసరా వరకు ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ చేపట్టాలని లేకపోతె ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాదయాత్ర చేసి ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని చెప్తామన్నారు. మా పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి విద్యార్థి కి ఎక్కడ చదువుతున్నా ఫీజు మేమే కడతాం. బిజెపి పార్టీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు జాతీయ హోదా ఇవ్వాల్సిందేనన్నారు. మోడీ బిసి బిల్లుపై ఒక్క మాట మాట్లాడటం లేదన్నారు. బిసి లకు 50% రిజర్వేషన్ అమలు చేసే వరకు కేంద్రం పై యుద్ధం చేస్తాం. జన గణనలో ఓబీసి కాలం పెట్టాలని డిమాండ్ చేశారు.

# సెన్సస్–2027 నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

■ డీసీఓ భారతి హోళీకేరి

**మహబూబాబాద్, మే.08(ప్రభాత గమనం):**



రాష్ట్రంలో సెన్సస్–2027 కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ (డీసీఓ) భారతి హోళీకేరి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. శుక్రవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఓ భారతి హోళీకేరి మాట్లాడుతూ..సెన్సస్–2027 కార్యక్రమం దేశ ప్రణాళికా రూపకల్పనకు కీలకమైందని తెలిపారు. జనగణనకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రస్తుతం కొనసాగుతున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. డేటా నమోదు సమయంలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో సాంకేతిక సహాయం అవసరమైన వారికి తగిన సహకారం అందించాలని సూచించారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసి, వారికి సమగ్ర శిక్షణ అందించాలని ఆదేశించారు. సెన్సస్‌కు అవసరమైన మాన్యువల్స్, సూపర్వైజర్ కిట్స్, మ్యాప్స్ తదితర సామగ్రి పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అదనపు రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో ఐ డి ఓ సి కార్యాలయం క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ మాట్లాడుతూ..జిల్లాలో సెన్సస్–2027 ఏర్పాట్లను విస్తృత స్థాయిలో చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల ఎంపిక, శిక్షణ కార్యక్రమాలు, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు . అనంతరం సెన్సస్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, డేటా ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ శ్రీనివాస రావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాజీపేట ప్రజల సహకారం మరువలేనిది

■ సీఐ సుధాకర్ రెడ్డి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

కాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సుమారు 27 నెలల పాటు విధులు నిర్వహించిన సుధాకర్ రెడ్డి బదిలీపై శాయంపేట సీఐగా వెళ్తున్న సందర్భంగా సహచర సిబ్బంది, ప్రజలు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజీపేటలో తన విధి నిర్వహణలో తోటి సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఎంతో సహకరించారని పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, మేధావులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు అందరి సహకారం వల్లే తన సేవా ప్రయాణం విజయవంతమైందని అన్నారు. ప్రత్యేకంగా మీడియా ప్రతినిధుల పాత్రను ఆయన ప్రశంసించారు. తాను ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ప్రతి సమస్యను తన దృష్టికి తీసుకువస్తూ, పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా కీలక భాగస్వామిగా నిలిచిందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అనేక మంచి కార్యక్రమాలు నిర్వహించడంలో మీడియా మిత్రులు తనకు అండగా నిలిచారని అన్నారు. కాజీపేట ప్రజలు, ప్రజాప్రతినిధులు, మీడియా మిత్రులు, సహచర ఉద్యోగుల సహకారం తన విజయానికి ప్రధాన కారణమని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. తన విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ అందరికీ నమస్కారాలు తెలిపారు.



# టీఆర్పీలోకి భారీగా చేరికలు

■ తీన్మార్ మల్లన్న సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ నేత శ్రీకాంత్, నాయకులు

**హైదరాబాద్, మే8(ప్రభాత గమనం) :**

తెలంగాణలో బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం జరగాలంటే బీసీల రాజ్యాధికారం తప్ప మరో మార్గం లేదని, బీసీల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారి హక్కుల కోసం కొట్లాడుతున్న ఏకైక పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అని పేర్కొంటూ మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు శ్రీకాంత్ ఆ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో టిఆర్పీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ కి పార్టీ కండువా కప్పి తీన్మార్ మల్లన్న ఆహ్వానించారు. శ్రీకాంత్ తో పాటు ఆయన అనుచరులు, యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ..రాష్ట్రంలో బీసీలు ఎన్నో ఏళ్లుగా రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని, అధికార పార్టీలన్నీ బీసీలను కేవలం ఓట్ల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ బీసీలకు నిజమైన రాజకీయ అధికారం రావాలని, అట్టడుగు వర్గాల పి ల్లలకు విద్య, ఉద్యోగాలు, ఆర్థిక అవకాశాలు అందాలని స్పష్టమైన సిద్ధాంతంతో పోరాడుతున్న నాయకుడు తీన్మార్ మల్లన్నని తెలిపారు. అందుకే తెలంగాణ భవిష్యత్తు కోసం, బీసీల ఆత్మగౌరవం కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరినట్లు వెల్లడించారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ..తెలంగాణలో బీసీలు సంఖ్యలో ఎక్కువైనా అధికారంలో మాత్రం దూరంగా ఉంచుతున్నారని అన్నారు. బీసీల చెమటతో సంపదలు సృష్టించుకునే వర్గాలు రాజకీయ అధికారాన్ని మాత్రం తమ చేతుల్లోనే ఉంచుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితులను మార్చేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉద్యమ స్థాయిలో పోరాటం చేస్తోందని తెలిపారు. బీసీ యువత రాజకీయంగా ఎదగాలని, సమాజంలో నాయకత్వం చేపట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం అవుతుందని, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు మరియు అణగారిన వర్గాలందరికీ ఈ పార్టీ ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నా రు. కార్యక్రమంలో మేడ్చల్, గుండ్ల పోచంపల్లి ప్రాంత నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

■ రూ.రెండు లక్షల బంగారం స్వాధీనం

■ మహిళలను టార్గెట్ చేస్తూ చైన్ స్నాచింగ్ కు పాల్పతున్న నిందితులు

**ప్రభాతగమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

హనుమకొండ నగరంలో మహిళలను టార్గెట్ చేస్తూ చైన్ స్నాచింగ్ పాల్పడిన ఇద్దరు యువకులను హనుమకొండ పోలీసులు సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు నిందితుల వద్ద నుంచి సుమారు రెండు లక్షల విలువైన రెండు తులాల బంగారు పుస్తెలతాడు ఒక మోటార్ సైకిల్ ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు వివరాల ప్రకారం నిందితులు చీకటి రాహుల్ ఉట్కూరి సాయికిరణ్ గత కొద్దిరోజులుగా హనుమకొండలోని ఒక ప్రైవేట్ హాస్టల్లో ఉంటున్నారు జల్సాలు మత్తుకు అలవాటు పడి వీరి ఖర్చులకోసం దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకునారు ఈనెల నాలుగవ తేదీన పెద్దమ్మ గడ్డ ప్రాంతంలో బైక్ పై తిరుగుతూ ఒంటరిగా వెళ్లే మహిళలను గమనించి చైన్ స్నాచింగ్ పాల్పడాలని నిర్ణయించుకున్నారు ఈనెల నాలుగో తేదీన పెద్దమ్మ గడ్డ ప్రాంతంలో బైక్ పై తిరుగుతూ ఒంటరిగా వెళ్లే మహిళలను గమనించి చైన్ స్నాచింగ్ ప్రయత్నించగా అవకాశం దొరకక అనంతరం మే 5వ తేదీన ఉదయం బొక్కలగడ్డ ప్రాంతంలో ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలో రెండు తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని పరారయ్యారు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సిసి కెమెరాల సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు ఈ క్రమంలో దొంగలించిన బంగారాన్ని అమ్మేందుకు వెళుతున్న సమయంలో హనుమకొండ మరియు సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా చాకచక్యంగా పట్టుకున్నారు అనంతరం నిందితులను రిమాండ్ పై కోర్టులో హాజరుపరుస్తున్నట్లు హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శివకుమార్ మాట్లాడుతూ యువత జల్సాలకు మత్తుకు బానిసై నేరాలకు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మత్తుకు అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ కేసును చేదించడంలో ప్రతిభ కనపరిచిన హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ సిసిఎస్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర హనుమకొండ ఎస్సై కిషోర్ తో పాటు పోలీసు సిబ్బందిని ఏసిపి హనుమకొండ అభినందించారు



# ప్రతి ఒక్కరూ స్వీయ గణనలో పాల్గొనాలి

■ క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలి

■ నూతన మెడికల్ కాలేజ్ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

■ పంట మార్పిడి విధానం, సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు ముందుకు రావాలి

■ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, మే8(ప్రభాత గమనం):**

స్వీయ గణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని, తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించినట్లు అవుతుందని జనాభా గణన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొని వారి యొక్క ఐడిని పొందాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఇప్పటికే అన్ని విభాగాలలో ప్రభుత్వ ప్రైవేటు ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ తదితర ఉద్యోగస్తులు తమ వివరాలను నమోదు చేసుకున్నారని, మరింత విస్తృత ప్రచారం కల్పించడం కోసం ఈరోజు స్వీయ జనన ప్రచార రథం ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఆడియో, వీడియో, వివిధ సామాజిక మాధ్యమాలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఈ జన గణన పై విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. బ్యాంకింగ్ రంగ వ్యవస్థ సామాజిక బాధ్యతగా రైతులకు అండగా ఉండేందుకు కృషి చేయాలని అందులో భాగంగానే గూడూరు మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పరికరాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ..భారత ప్రభుత్వం రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తుందని ప్రతి ఒక్క రైతు వారి హక్కుగా భావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే పథకాన్ని వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం పంట మార్పిడి విధానం, అంతర్ పంటలు పామ్ ఆయిల్, కూరగాయలు, తదితర వాణిజ్య, మిల్లెట్స్,పంటలు ద్వారా రైతులు అధిక లాభాలు పొందుతున్నారని ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి పంటలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.సేంద్రియ ఎరువుల వాడకం, నేచురల్ వ్యవసాయం, తెలియపరచాలని, అధికంగా యూరియా వాడకం వలన భూసారం దెబ్బతింటుందన్నారు.నానో యూరియా పై రైతులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం రవీంద్రబాబు, కమలాకర్, ఏ.రవి, రమేష్, విజయ్ కుమార్, గూడూరు సర్పంచ్ సునీత కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహబూబాబాద్ పట్టణంలోని నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజ్ భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటికే దాదాపుగా పూర్తి అయిన భవనం యొక్క పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి సిద్ధం చేయాలని తెలిపారు. అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, తదితర పనులు పూర్తి కావడంతో మిగిలిన చిన్న చిన్న వర్కులను తక్షణమే పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో కలెక్టర్ వెంట సిపిఓ శ్రీనివాసరావు, డి పి ఆర్ ఓ రాజేంద్రప్రసాద్, వెటర్నరీ జిల్లా అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, ఉద్యాన వన శాఖ అధికారి జి. మరియన్న, ఏ డి ఏ శ్రీనివాసరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్ లకావత్, ఆర్ అండ్బి ఈఈ, తదితరులు పాల్గొన్నారు.



# మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు

■ షీ టీమ్ ఎస్ఐ స్వాతి

■ లింగ వివక్షపై మహిళా సంఘాలకు అవగాహన

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

నర్సంపేట నెహ్రు నగర్ లో మహిళా సంఘాలతో షీటీమ్ ఎస్సై స్వాతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాని ఉద్దేశించి ఎస్సై స్వాతి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న వివక్ష, లింగ అసమానేత, సెక్సిజం, మిసోజనీ, పితృస్వామ్య భావజాలం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు వివరించారు. మహిళల భద్రత, గౌరవ రక్షణ కోసం అమల్లో ఉన్న ఫోక్సో చట్టం–2013 గురించి అవగాహన కల్పిస్తూ, ఉద్యోగ స్థలాల్లో మహిళలపై వేధింపులు జరిగితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే షీటీమ్ అంటే ఏమిటి, అది ఎలా పనిచేస్తుంది, మహిళలకు, బాలికలకు షీటీమ్ ద్వారా ఎలాంటి రక్షణ, సహాయం అందుతుందనే విషయాలను ప్రజలకు తెలియజేశారు. బాలలపై జరుగుతున్న లైంగిక దాడులు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం ప్రాముఖ్యత, బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలు, యువత ప్రేమ పేరుతో మోసపోవడం, ఎలోపింగ్ వంటి సంఘటనలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళల అక్రమ రవాణా, సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితులపై నమ్మకం పెట్టుకోరాదని, వ్యక్తిగత సమాచారం సోషల్ మీడియాలో పంచుకోవడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, మహిళా హెల్ప్‌లైన్ 1091, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, డయల్–100 సేవల గురించి వివరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు, సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే షీటీమ్ వాట్సాప్ నంబర్ కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల్లో మహిళా భద్రత, బాలల రక్షణపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని షీటీమ్ ఎస్.ఐ స్వాతి తెలిపారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374